క్లుప్తంగా

యోగా సాధనతో జ్ఞాపకశక్తి మెరుగు

గద్వాల అర్బన్: నిత్యం యోగా సాధన చేయడంతో జ్ఞాపకశక్తి మెరుగవుతుందని ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ అన్నారు. మూడోరోజు బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ ఆర్గనైజేషన్, రామచంద్ర మిషన్ నిర్వాహకులు విద్యార్థినులకు యోగా, ధ్యాన సాధన ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. రష్యా దేశానికి చెందిన లిల్లీ విద్యార్థినులకు యోగాసనాలు చేయించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగాతో మానసిక ఉల్లాసంతో పాటు ఒత్తిడి దూరం అవుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైనర్స్ రఘు, కరణ్, జిల్లా లలిత, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు ఉన్నారు.

పదోన్నతి కల్పించాలని మేటీల వినతి



ధరూరు: మండలంలో కొన్నేళ్లుగా పని చేస్తున్న సీనియర్ మేటీలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఎంపీడీఓ ఎండీ జబ్బార్‌కు సీనియర్ మేటీలు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో 16 మంది సీనియర్ మేటీలు కలిసి సమస్యలను వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శ్రీనివాసులు, కురుమన్న, నర్సింహులు, రాజు, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

శాంతినగర్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా బుధవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన షేక్ మోహిన్‌బాబు, సికిందర్‌లు తండ్రి అబ్దుల్ సలాం జ్ఞాపకార్థం ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రజాక్ మౌలానా, కలీముల్లా మౌలానా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

రాజోళి: ఉపాధి కూలీలు, వ్యవసాయ పనులు చేసే వారు జాగ్రత్తలు వహించాలని ఎంపీపీ మరియమ్మ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. చిన్నారులను మధ్యాహ్న వేళ బయటకు రాకుండా తల్లిదండ్రులను చూడాలని పేర్కొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

గద్వాల క్రైం: విద్యార్థిని అదృశ్యమైన ఘటన పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్‌షుకూర్ వివరాల ప్రకారం గద్వాల మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు రాసేందుకు గద్వాలకు వెళ్లింది. కూతురును తీసుకెళ్లేందుకు తండ్రి పరీక్ష కేంద్రానికి వచ్చాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో కుటుంబసభ్యులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ తెలవకపోవడంతో విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మినుము విత్తనాలు పంపిణీ



మానవపాడు: జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా గ్రామ రైతులకు మినుము విత్తనాలు 100 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నామని వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాశ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు మినుములు అందజేశారు. మినుము వీబీఎన్-8, పంటకాలం 60 నుంచి 75 రోజులు మాత్రమే జీవితకాలం ఉండును. కార్యక్రమంలో రైతుబంధు సమితి కోఆర్డినేటర్ భారత్‌భూషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

గద్వాల/శాంతినగర్: జిల్లా కేంద్రంతో పాటు శాంతినగర్ పట్టణంలో బుధవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంజిపేట రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. శాంతినగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, నర్సింహులు, వెంకటన్న, నాగరాజు, కేశవ్, అజ్జు, ఉప్పల పూర్ణచంద్రరావు, రాజోళి కిష్టన్న, ఈరన్న, భాస్కర్‌రావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు ముస్తాబు

● సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



బీచుపల్లిలో ముస్తాబైన సీతారాముల ఉత్సవ విగ్రహాలు

రాజోళి: శ్రీరామనవమి పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలను బుధవారం ముస్తాబు చేశారు. మండల కేంద్రంతో పాటు కొత్త రాజోళి, తుమ్మలపల్లె, ముండ్లదిన్నె వివిధ గ్రామాల్లో గురువారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలకు మామిడి తోరణాలు కట్టి, అందంగా అలంకరించారు.

గట్టు: మండల కేంద్రంలోని గండి ఆంజనేయ స్వామి దేవాలయం సీతారాముల కల్యాణానికి బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గట్టు-1 ఎంపీటీసీ సభ్యురాలు మహేశ్వరి, రామునాయుడు పాల్గొన్నారు.

బీచుపల్లిలో..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అయిజ: సీతారామ కల్యాణ మహోత్సవం సందర్భంగా మండలంలోని కిష్టాపురంలోని రామాలయంలో శ్రీరామ నామావళి భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం సూర్యోదయం నుంచి గురువారం సూర్యోదయం వరకు కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గద్వాల: జిల్లా కేంద్రంలోని కాకతీయ టెక్నో స్కూల్, కాకతీయ స్మార్ట్ కిడ్స్, విశ్వభారతి హైస్కూల్, ప్రగతి విద్యానికేతన్ తదితర పాఠశాలల్లో శ్రీరామనవమి వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. బుధవారం ఆయా పాఠశాల ఆవరణలో సీతారామ కల్యాణం కనుల పండువగా సాగింది. శ్రీరామనవమి విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వడపప్పు, పానకం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో సీతారాములవారి కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం మొదటి రోజు అంకురార్పణ, మూలవన్యహవనం, విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అర్చకులు ఎదుర్కోళ్ల కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, చల్లా వెంకట్రామిరెడ్డి, అర్చకులు వంశీ కృష్ణాచార్యులు, రంగనాథాచార్యులు, నరసింహాచార్యులు, బాలాజీ, ఆంజనేయ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో సీతారాముడి వేషధారణలో విద్యార్థులు



రాజోళిలోని ముండ్లదిన్నెలో..



అయిజ కిష్టాపురంలో..

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



అయిజలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కమలాదేవి



గొర్లఖాన్‌దొడ్డిలో ..

అయిజ: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సీడీపీఓ కమలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని పులికల్‌లో పోషణపక్వాడ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్దకల్ ప్రాజెక్ట్ సీడీపీఓ కమలాదేవి హాజరై మాట్లాడారు. ప్రతి రోజు తీసుకునే ఆహారంలో తప్పనిసరిగా తృణధాన్యాలు ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాటీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

మల్దకల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి అన్నారు. పోషణపక్షంలో భాగంగా బుధవారం మండలంలోని తాటికుంటలో నిర్వహించిన గర్భిణీ, బాలింతల ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. సందర్భంగా చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, లక్ష్మీనారాయణమ్మ, అలియో పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మహిళా సంఘాల సభ్యులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు చిరుధాన్యాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ నాగరాణి మాట్లాడుతూ ప్రతి రోజు ఆహారంలో చిరుధాన్యాలు, తృణధాన్యాలు ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు శంకరమ్మ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇమాంసాబ్, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శాంతినగర్: పోషణపక్షంలో భాగంగా ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు బుధవారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తయారుచేసిన వంటకాలను ప్రదర్శించి వాటివల్ల కలిగే పోషకాల గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ వివరించారు. పోషన్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సునీత, శ్రీదేవి, బుక్‌కీపర్లు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం కోసమే పాదయాత్ర



మాట్లాడుతున్న గొంగళ్ల రంజిత్ కుమార్

ధరూరు: సబ్బండ వర్గాల ఆత్మగౌరవం కోసమే పాదయాత్ర చేస్తున్నామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. బుధవారం 13వ రోజు పాదయాత్ర మండలంలోని పారుచర్ల, సోంపురం, మన్నాపురం, బూరెడ్డిపల్లి, మార్లబీడు, ర్యాలంపాడు గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఇప్పటి వరకు కుటుంబ పాలనగా సాగిన గద్వాలలో అన్ని వర్గాల ప్రజలు వెనుకబాటుకు గురయ్యారన్నారు. గద్వాల గడ్డపై బహుజన జెండా ఎగరడమే నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఉద్దేశమన్నారు. ఆయా గ్రామాల ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ప్రతి సమస్య పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని భరోసా కల్పిస్తూ ముందుకుసాగారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, నాయకులు గోవిందు, తిమ్మప్ప, రంగస్వామి, ఏసన్న, ఉపేంద్ర, రాము, విష్ణు, ప్రేమ్‌రాజ్, భీమన్‌గౌడ్, అంజి, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శేఖర్

మల్దకల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శేఖర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది ఉన్నారు.

అయిజ: పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో బుధవారం సైబర్ అంబాసిడర్ ప్రోగ్రాం నిర్వహించారు. సైబర్ నేరాలపై కానిస్టేబుల్ భాస్కర్ రాజు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ చెన్న బసమ్మ, సీఆర్‌టీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్లను అందజేసిన సర్పంచ్

గట్టు: మండలంలోని మాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 72 మంది విద్యార్థులకు బుధవారం పరీక్షా ప్యాడ్లు, పెన్నులను సర్పంచ్ సిద్దిరామప్ప అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ టీవీలకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు రఘు, రేణుక, చంద్రబాబునాయుడు, రఘు, కార్యదర్శి ప్రదీప్, పేపర్ నర్సింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం



అలంపూర్ రూరల్: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని లింగన్‌వాయిలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నరేష్, రాముడుకు సంబంధించిన గడ్డివాముకు నిప్పు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. మొత్తం రూ.1.20 లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు నరేష్ తెలిపారు.

ఉండవెల్లి: మండలంలోని భైరపూర్ గ్రామ శివారులో బుధవారం రైతు పొలం గెట్టుకు నిప్పంటించడంతో చుట్టు పక్కల ఉన్న పశుగ్రాసానికి అంటుకొని మంటలు చెలరేగాయి. ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

కరపత్రాలు విడుదల

మానవపాడు: వచ్చే నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తునట్లు ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం దీనికి సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుకార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్



ఉండవెల్లి: మండలంలోని బైరాపురం శివారులో రెండు ఇసుక డంపులను ఎస్ఐ బాల్‌రాజు, తహసీల్దార్ వీరభద్రప్ప బుధవారం సీజ్ చేశారు. అనంతరం ఇసుకను బైరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైరాపురం శివారులో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా రెండు ఇసుక డంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్ఐ సుచిత్ర పంచనామా నిర్వహించారు. తహసీల్దార్ వీరభద్రప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతినెలా వైద్య పరీక్షలు

మల్దకల్: గర్భిణీ, బాలింతలు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణీ, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెలవుపై ఎంపీడీఓ...?

అలంపూర్: అలంపూర్‌లో ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న నాగశేషాద్రి సూరి సెలవుపై వెళ్లినట్లు సమాచారం. వారం రోజుల కిందట తమను వేధిస్తున్నాడని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో జెడ్పీ సీఈఓ అలంపూర్‌కు వచ్చి విచారణ చేసినట్లు స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు ఫిర్యాదు చేయడంతో ఎంపీడీఓ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది.

రూ.20వేలు అందజేత

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు చిన్నయ్య మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంఈఓ శివప్రసాద్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు లక్ష్మన్న, ఇక్బాల్, అబిద్, నాగేంద్రుడు, శ్రీనివాసులు గ్రామంలో హెచ్‌ఎం చిన్నయ్య భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.20వేలు అందజేశారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



రాజోళిలో పోలీసులు గుర్తించిన సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు



మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

గట్టు: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని గద్వాల సీఐ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. సీఐ ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు, 18 మంది పోలీస్ అధికారులు పాల్గొన్నారు. పోలీసులు నాలుగు బృందాలుగా వీడిపోయి కాలనీలో తనిఖీలు చేపట్టారు. కొంతమంది వ్యక్తిగత వివరాలను సేకరించి, ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం యాప్ ద్వారా, వేలి ముద్రలను తీసుకున్నారు. 75 ఇళ్లల్లో సోదాలు చేశారు. సరైన పత్రాలు లేని 28 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పవన్‌కుమార్, కేటీదొడ్డి ఎస్ఐ వెంకటేష్, ధరూరు ఎస్ఐ శేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భద్రత కోసమే కార్డెన్‌సెర్చ్

రాజోళి: ప్రజల భద్రత కోసమే కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తామని శాంతిగనర్ సీఐ శివశంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. పోలీసులు శాంతి భద్రతల దృష్ట్యా చేసే పనికి ప్రజలు పూర్తి సహకరాలు అందించాలన్నారు. ప్రత్యేకంగా మద్యంకు యువత బానిసై పెడదోవ పట్టి, జీవితాలను నాశనం చేసుకోవడమే కాకుండా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడతారని, అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లపై తరచూ దృష్టి సారించాలన్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందివ్వాలని, బాల కార్మిక వ్యవస్థను, బాల్య వివాహాలను నిర్మూలించి, గ్రామాల్లో ఐక్యతగా కలిసి ఉండేందుకు కృషి చేయాలన్నారు. మోటార్ వెహికల్ చట్టాలపై, బీమా ప్రాముఖ్యతలు, హెల్మెట్, వాడకాలపై ప్రజలకు సలహాలు, సూచనలు చేశారు. మొత్తం 240 ఇళ్లను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 28 ద్విచక్రవాహనాలు, మరో రెండు నాలుగు చక్రాల వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సీహెచ్ కుర్మయ్య, శ్రీనివాస్ నాయక్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికా ప్రకారం చదవాలి



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2023 బ్యాచ్ విద్యార్థుల బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వరీయ విద్యాలయ బ్రహ్మకుమారి మంజుల మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఒత్తిడి లోనుకాకుండా ప్రణాళికా ప్రకారం చదివి మంచి మార్కులు తెచ్చుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల సహకారం ఎప్పటికి మరిచిపోలేమని విద్యార్థులు పేర్కొన్నారు. గత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాధికార యాత్ర విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న కేశవరావు

అలంపూర్: బీఎస్పీ బహుజన రాజ్యాధికార యాత్రను విజయవంతం చేద్దామని జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. బుధవారం పట్టణ కూడలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బహుజనుల రాజ్యాధికారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేపట్టారన్నారు. నియోజకవర్గంలో ఈ నెల 30వ తేదీ నుంచి యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వడ్డేపల్లి, రాజోలి, ఇటిక్యాల మండలాల్లో ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని టూరిజం హోటల్‌లో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ హాజరై మాట్లాడారు. పేదల కష్టాలు తెలుసుకునేందుకే యాత్ర ఉద్దేశమన్నారు. అనంతరం పలువురు బీఎస్పీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణ, కనకం బాబు, సుంకన్న, నాగరాజు, సుధాకర్, శ్రీకాంత్, రమేష్, ఉబేద్, బాబు, శ్రీకాంత్, సునీల్, రవిరాజ్, రేపల్లె రమేష్, ప్రకాశం, మద్దిలేటి, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మానవపాడు: ప్రతి ఒక్కరూ పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని జల్లాపురంలో పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం పౌరులందరికి సమాన హక్కులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నదేవుడు, ఆర్ఐ రజానీకాంత్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్, పంచాయతీ కార్యదర్శి జయమ్మ, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

అయిజ: మండలంలోని భూంపురం ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అధికారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భీమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.